04-03-2025
బుధవారం
మల్కాజిగిరి
jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 165 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



## ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకంపనలు

■ ట్రంప్ సుంకాల దెబ్బకు కుదేలయిన అమెరికా మార్కెట్లు

**జయభేరి, వాషింగ్టన్, మార్చి 4 :**

ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకంపనలు తీవ్రంగా ఉంటున్నాయి. కెనడా, మెక్సికో దేశాల ఉత్పత్తులపై 25 శాతం వరకు విధించిన సుంకాలు మంగళవారం నుంచి అమలులోకి రాగా, ఆ దేశాలు ...మిగతాది 2 లో

## విశ్వసనీయ భాగస్వామిగా భారత్

■ ప్రధాని నరేంద్ర మోడీ

**జయభేరి, న్యూఢిల్లీ మార్చి 4:**

నాణ్యమైన వస్తువులు ఉత్పత్తి చేయగల విశ్వసనీయ భాగస్వామిగా భారత్ వైపు ప్రపంచం చూస్తున్న తరుణంలో భారతీయ పరిశ్రమ రంగం ప్రపంచ అవకాశాల సద్వినియోగానికి 'భారీ చర్యలు' తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం కోరారు. 'నియంత్రణ, పెట్టుబడి, వ్యాపార సంస్కరణలు, నిర్వహణలో సౌలభ్యం' అంశంపై బడ్జెట్ అనంతర వెబినార్‌లో మోడీ ప్రసంగిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితుల వల్ల ఏర్పడిన సప్లై చైన్ అంతరాయాల నడుమ ప్రపంచానికిఇప్పుడు అధిక నాణ్యమైన వస్తువులు ఉత్పత్తి చేయగల, ఆధారపడదగిన సప్లై చైన్ ఉన్న విశ్వసనీయ భాగస్వామి అవసరం ఉన్నదని చెప్పారు.'మన దేశానికి ఈ పని చేయగల సత్తా ఉంది, మీ అందరూ (పరిశ్రమ) సత్తా ...మిగతాది 2 లో





# రేషన్ కోటా పెంచండి

ధాన్యం బకాయిలు రూ. 1,468.94 కోట్లను విడుదల చేయండి
కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జయభేరి, న్యూ డిల్లీ మార్చి 4 :**

తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ పథకం కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర ఆహార పౌర సరఫరాలు, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో 4 వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం, తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలాల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర మంత్రికి వివరించి, గతంలో మంజూరు చేసిన 4 వేల మెగావాట్ల ఉత్పత్తి అనుమతులను పునరుద్ధరించాలని కోరారు. తెలంగాణ కొత్త రేషన్ కార్డుల జారీ నేపథ్యంలో అవసరమైన కోటా పెంచాలని సీఎం రేవంత్ కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి ఉత్తమ్, సీఎం.. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయ్యారు. 2014,15కి గాను సేకరించిన ధాన్యం బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద మే 2021 నుంచి మార్చి 2022 వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకుని అందుకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని చెప్పారు. జూన్ 2021 నుంచి ఏప్రిల్ 2022 వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

## తల్లిదండ్రుల ఆందోళన

■ విద్యార్థుల బొట్టు తొలగించిన ప్రిన్సిపాల్

**జయభేరి, మేడ్చల్:**



పెద్దఅంబర్ పేట్ కండోర్ షైన్ స్కూల్ ప్రిన్సిపల్ అత్యుత్సాహంగా ప్రవర్తించి బొట్టు పెట్టుకుని వచ్చిన విద్యార్థులను చితకబాదారు, స్కూల్ లో ప్రెయర్ చేసే సమయంలో లైన్ లో ఉన్న విద్యార్థుల వద్దకి వెళ్లి బొట్టు ఎందుకు పెట్టుకున్నావ్ అంటూ బలవంతంగా వాష్ రూంలోకి తీసుకెళ్లి బొట్టు తీయించాడు ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, దీనిపై సదరు విద్యార్థి సెల్ఫీ వీడియో తీసుకుని మనోవేదనకు గురవడం తో తల్లి తండ్రులు హిందూ సంఘాలు స్కూల్ వద్దకి చేరుకుని ప్రిన్సిపల్ తీరుపై స్కూల్ లో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకి దిగారు. దీనితో ప్రిన్సిపాల్ రాలేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు స్కూల్ సిబ్బంది, సుమారు 10 మంది విద్యార్థులకి ప్రిన్సిపాల్ ఇలా వాష్ రూమ్ లోకి తీసుకుని వెళ్లి బొట్టు తెపించడం జరిగిందని తల్లితండ్రులు తెలిపారు, స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మయ్య పై చర్యలు తీసుకుని మళ్ళీ ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని సనాతన ధర్మానికి విరుద్ధంగా నడుస్తున్న స్కూల్ మూసేసే వరకు ఊరుకునే ప్రసక్తి లేదని హిందూ సంఘులు హెచ్చరించాయి.

## ఆస్ట్రేలియాపై విజయం



■ చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్‌కు టీం ఇండియా

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో దుబాయి వేదికగా జరిగిన తొలి సెమీ ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాపై నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించిన టీం ఇండియా ఫైనల్స్‌లోకి ఎంటరైంది. సౌత్ ఆఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగే మరో సెమీ ఫైనల్ మ్యాచ్ విజేతతో టీం ఇండియా ఫైనల్‌లో తల పడనున్నది. నిర్ణీత 50 ఓవర్లలో 265 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన టీం ఇండియా మరో 11 బంతులు మిగిలి ఉండగానే విజయ తీరాలకు చేరుకుంది. విజయానికి చేరువలో ఉండగా హార్దిక్ పాండ్యా ఔటయినా 49వ ఓవర్‌లో మ్యాక్స్‌వెల్ వేసిన తొలి బంతిని కేఎల్ రాహుల్ సిక్సర్‌గా మలచడంతో 267 పరుగులతో టీం ఇండియా విజయం పూర్తయింది. స్పిన్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై టీం ఇండియా బ్యాటర్లు ఆచితూచి ఆడుతూ జట్టు స్కోర్ పెంచడానికి ...మిగతాది 2 లో

## ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఫిక్స్

■ చంద్రబాబుకు పవన్ కీలక సూచన
■ నాగబాబుకు ఖాయం ఇప్పటికే



**జయభేరి, అమరావతి :**

జనసేనకు ఒక ఎమ్మెల్సీ పదవి ఖాయం అని తేలిపోయింది మెగా బ్రదర్ నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం అనివార్యం. కొద్ది నెలల కిందట నాగబాబును ఏపీ క్యాబినెట్లోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే నాగబాబు ఏ సభల్లోనూ సభ్యుడు కాదు. అందుకే ఎమ్మెల్సీగా చేసి తరువాత మంత్రివర్గంలోకి తీసుకోవాలి. అందుకే జనసేనకు ఒక ఎమ్మెల్సీ స్థానం ఇస్తే మాత్రం అది నాగబాబు కు మాత్రమే. అయితే జనసేనకు మరో ఎమ్మెల్సీ స్థానం ఇచ్చే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం నడుస్తోంది.... మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## విశ్వసనీయ భాగస్వామిగా భారత్

ఉన్నవారు, ఇది మనకు మహత్తర అవకాశం. ప్రపంచం అంచనాలను కేవలం ఒక వీక్షకునిగా మన పరిశ్రమ చూడరాదని కోరుకుంటున్నా. మనం వీక్షకులుగా ఉండిపోరాదు, దీనిలో మీకు పాత్ర ఉందని మీరు గ్రహించవలసి ఉంటుంది, మీ కోసం అవకాశాలను మీరు కోరుకోవలసి ఉంటుంది' అని ప్రధాని మోడీ పారిశ్రామిక అధిపతులతో చెప్పారు. ప్రభుత్వం గడచిన పది సంవత్సరాలుగా పరిశ్రమతో కలసి పని చేస్తున్నదని, సంస్కరణలు చేపట్టడానికి, ఆర్థిక క్రమశిక్షణకు, పారదర్శకతకు.సమ్మిళిత వృద్ధికి తన నిబద్ధతను ప్రదర్శించిందని ప్రధాని తెలియజేశారు. 'ఇప్పుడు భారత్ ప్రపంచానికి వృద్ధి మార్గదర్శక దేశం. సంక్లిష్ట సమయాల్లో ధీరచిత్తంతో ఉండగలనని భారత్ నిరూపించింది. ప్రస్తుతం ప్రతి దేశంభారత్‌తో తమ ఆర్థిక భాగస్వామ్యాన్ని పటిష్ఠం చేయాలని వాంఛిస్తోంది. మన ఉత్పత్తి రంగం ఈ భాగస్వామ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని మోడీ ఉద్ఘాటించారు. ప్రభుత్వ నిలకడ, సంస్కరణలకు హామీ కారణంగా పరిశ్రమ నూతన ఆత్మ విశ్వాసం పొందిందని ఆయన చెప్పారు.'రానున్న సంవత్సరాల్లో ఇది కొనసాగుతుందని ఉత్పత్తి, ఎగుమతుల రంగాల్లో సంబంధిత సంస్థలకు హామీ ఇవ్వాలని అనుకుంటున్నా. మీరు దృఢవిశ్వాసంతో ముందుకు సాగి, భారీ అడుగులు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. దేశ ఉత్పత్తి, ఎగుమతుల రంగాలకు కొత్త మార్గాలు తెరచుకున్నాయి' అని మోడీ చెప్పారు. 'రాష్ట్రాలు తమలో తాము పోటీ పడాలి& ప్రగతిశీలక విధానాలతో రాష్ట్రాలు ముందుకు వస్తే కంపెనీలు వాటిని పెట్టుబడికి ఆకర్షణీయ గమ్యస్థానాలుగా భావిస్తాయి' అని మోడీ సూచించారు.

## ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకంపనలు

కూడా అమెరికా ఉత్పత్తులపై 25 శాతం వరకు సుంకాలు విధించాయి. అవి మార్చి 10 నుంచి అమలు లోకి రానున్నాయి. ఇప్పటికే చైనా ఉత్పత్తులపై 10 శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా 20 శాతానికి పెంచడం తెలిసిందే. ఫెంటనిల్ డ్రగ్స్ అక్రమ రవానాను అడ్డుకోవడంలో బీజింగ్ విఫలమవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ ప్రకటించారు.చైనాపై సుంకాలు గత నెల నుంచే అమలు కాగా, తాజాగా వాటిని 20 శాతానికి పెంచడం గమనార్హం. దీనికి తగ్గట్టు చైనా కూడా అమెరికాకు గట్టి బదులిచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతోన్న వస్తువులపై 10 నుంచి 15 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. సోయాబీన్, పోర్క్, ఇతర ఉత్పత్తులపై 10 శాతం , చికెన్, మొక్కజొన్న, పత్తి వంటి ఉత్పత్తులపై 15 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించింది. మార్చి 10 నుంచి అవి అమలు లోకి వస్తాయని చైనా ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. మరోవైపు కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకాల విషయంలో ఎలాంటి మార్పు లేదని ట్రంప్ వెల్లడించారు.మార్చి 4 (అమెరికా కాలమానం ప్రకారం ) నుంచి అవి యథావిధిగా అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. దీనికి ప్రతిగా ట్రూడో కూడా అమెరికాపై సుంకాలు విధించారు.అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఆల్కహాల్, పండ్లు, సహా 107 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై తాము కూడా 25 శాతం సుంకం విధిస్తున్నట్టు వెల్లడించారు. ఇవి కూడా మంగళవారం నుంచే అమల్లోకి వస్తున్నట్టు తెలిపారు. ట్రంప్ సుంకాల దెబ్బకు అమెరికా మార్కెట్లు కుదేలయ్యాయి. ఆసియా పసిఫిక్,ఆస్ట్రేలియా మార్కెట్ల పైనా ఈ ప్రభావం పడింది.

## ఆస్ట్రేలియాపై విజయం

ప్రయత్నించారు. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసి గట్టి పునాది వేసిన విరాట్ కోహ్లీ.. ఈ మ్యాచ్‌లో కూడా 84 పరుగులతో టీం విజయంలో కీలక పాత్ర పోషించారు. 45 పరుగులకే ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఔటయినా, శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్‌లతో మంచి భాగస్వామ్యాలు నెలకొల్పుతూ జట్టు విజయానికి బాటలు వేశాడు. కోహ్లీ 84 పరుగుల్లో ఐదు ఫోర్లు ఉన్నాయి. కోహ్లీ తర్వాత శ్రేయాస్ అయ్యర్ 45 పరుగులు, కేఎల్ రాహుల్ 42 పరుగులతో పర్వాలేదనిపించారు. శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్, విరాట్ కోహ్లీ తర్వాత నిలకడగా ఆడుతూ హార్దిక్ పాండ్యా 28 పరుగుల వద్ద ఎల్లిస్ బౌలింగ్‌లో మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు. హార్దిక్ పాండ్యా స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రవీంద్ర జడేజాతో కలిసి కేఎల్ రాహుల్ ఫినిష్ చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్, ఆడం జంపా రెండేసి వికెట్ల చొప్పున, బెన్ ద్వార్‌షుయిస్, కూపర్ కొనొల్లీ చెరో వికెట్ తీశారు.

## ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఫిక్స్

మరోవైపు బీజెపి సైతం ఒక పదవి కోరుతోంది. ఆ పార్టీ నుంచి ఉత్తరాంధ్రకు చెందిన పివిఎన్ మాధవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇంకోవైపు విష్ణువర్ధన్ రెడ్డి తో పాటు సోము వీర్రాజు లాంటి నేతలు ఎమ్మెల్సీ పదవిని కోరుతున్నారు. కానీ టిడిపి తో సమన్వయం చేసుకునే వారికి అవకాశం కల్పించనున్నారు. అప్పట్లో సోము వీర్రాజు టిడిపి తో పొత్తును వ్యతిరేకించారు. అందుకే ఆయనకు అవకాశం ఉండదని తెలుస్తోంది ఇప్పటికే పట్టభద్రుల ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న పివిఎన్ మాధవ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇంకోవైపు తెలుగుదేశం పార్టీలో, ఆశావహులు అధికంగా ఉన్నారు. పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేసిన వారు ఉన్నారు. అటువంటి వారిలో పిఠాపురం వర్మ, దేవినేని ఉమా వంటి నేతలు ఉన్నారు. పవన్ గెలుపు కోసం వర్మ పనిచేశారు. కానీ ఇటీవల పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. అది ఆయనకు మైనస్ గా మారింది. మరోవైపు వంగవీటి రాధాకృష్ణ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇంకోవైపు బీద రవిచంద్ర యాదవ్, పైలా ప్రసాద్ సైతం ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దాదాపు గంట పాటు సమావేశం అయిన ఆ ఇద్దరు నేతలు ఎమ్మెల్సీ పదవుల విషయంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.

# పెళ్లైన 6 నెలలకే నవవధువు ఆత్మహత్య

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 4:

పెళ్లంటే నూరేళ్ల పంట.. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు వివాహం ఎంతో మందికి శాపంగా మారుతోంది. వరకట్న వేధింపులతో కొందరు ఆత్మహత్య చేసుకుంటుంటే, తన భర్తనో,లేక భార్యనో వివాహేతర సంబంధాలు పెట్టుకుని వేధిస్తున్నారని కొందరు.. తమను మోసం చేశారని భరించలేక సైతం సూసైడ్ చేసుకుంటున్నారు. తమ రిలేషన్‌కు అడ్డుగా ఉన్నారని తన భర్తను, భార్యను ప్లాన్ చేసి హత్య చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. హైదరాబాద్‌లో అలాంటి ఘటన ఒకటి జరిగింది. వికారాబాద్ జిల్లా తోర్ మామిడికి చెందిన దేవిక ఎంబీఏ పూర్తిచేసింది. హైదరాబాద్‌లోనే ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. 7 నెలల క్రితం పరిచయమైన మంచిర్యాలకు చెందిన సతీష్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది దేవిక. ఇరు కుటుంబాల అంగీకారంతో గోవాలో గ్రాండ్‌గా మ్యారేజ్ చేసుకున్నారు.. ఆ తర్వాత హైదరాబాద్‌లో అంతే గ్రాండ్‌గా రిసెప్షన్‌ని కూడా సెలబ్రేట్ చేసుకున్నారు. భర్త వరకట్న వేధింపులు భరించలేక హైదరాబాద్ రాయదుర్గం పీఎస్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. దేవిక (35), సతీష్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు. ఆరు నెలల కిందట గోవాలో వీరి వివాహం ఘనంగా జరిగింది. హైదరాబాద్ లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ లో నివాసం ఉంటున్నారు. నగరంలోని ఓ మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో దేవిక, సతీష్ ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దేవిక తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దేవిక ఆత్మహత్యకు పాల్పడినట్టు సోమవారం ఉదయం 10గంటల ప్రాంతంలో గుర్తించాడు భర్త సతీష్. పోలీసులకు, దేవిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.దేవిక ఆత్మహత్యకు భార్యాభర్తల మధ్య గొడవలే కారణమని దేవిక తల్లి రామలక్ష్మి పోలీసులకు తెలిపారు. భర్త వరకట్న వేధింపులతో తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం కోసం అల్లుడు తన కూతుర్ని వేధించేవాడని ఆమె వాపోయారు. పెళ్లయిన రెండు నెలల నుంచి తన కూతురికి వేధింపులు మొదలయ్యాయని, డిమాండ్ చేస్తే ఇల్లు కూడా రాసిచ్చామని తెలిపారు. కానీ దేవికను చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు అల్లుడు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని, మరో అమ్మాయికి ఇలా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# జీడీపీతో పాటు తలసరి ఆదాయం పెరగాలి

విదేశాలతో దౌత్యసంబంధాలు, వాణిజ్య వ్యూహాలు వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి సహకరిస్తున్నాయి. కొన్ని దేశాలు స్వతంత్రంగా ఎదుగుతున్నాయి. కొన్ని దేశాలు ఇతర దేశాల బలహీనతలను ఆసరాగా చేసుకుని, ఆయుధాల వ్యాపారం చేస్తూ, ఇతర దేశాల సంపదను కొల్లగొడుతూ, తమ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకుంటున్నాయి.




భారతదేశం అనాదిగా విదేశీయుల దౌర్జన్యానికి, దోపిడీకి గురవుతున్నా, నిరంతరం న్యాయంగా జీవించడానికే ప్రాధాన్యతనిస్తున్నది. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం తర్వాత భారత ఆర్థిక స్థితిగతుల్లో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారింది. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కేంద్ర ప్రభుత్వ ప్రయత్నించడం శుభపరిణామం.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల విషయంలో భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడంవలన భారత్ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని పలువురు మేధావులు ఆందోళన చెందుతున్నారు. అమెరికా రెసిప్రోకల్ టారిఫ్‌ల వలన భారత్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోదని ఆర్థిక విశ్లేషకులు గణాంకాలతో సహా వివరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక మందగమనం వలన అనేక దేశాలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారత్ కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభం చవిచూస్తున్న తరుణంలో భారత్ ఆర్థికంగా ఎదగడం ఎలా సాధ్యమయిందో, ఏయే రంగాలు అత్యధికంగా ప్రజలకు ఉపాధి కలిగిస్తున్నాయో, భవిష్యత్తులో భారత్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలో కూలంకషంగా చర్చించాలి.భారత దేశంలో అపారమైన సహజ వనరులున్నాయి. ఖనిజ సంపదకు లోటు లేదు. అపారమైన జల సంపద ఉంది. ఎన్నో నదులకు భారతదేశం పుట్టినిల్లు. భారత దేశంలో ఎన్నో పర్యాటక ప్రాంతాలున్నాయి. ఆదాయ వనరులున్నాయి.హిందూ మహా సముద్రం అరేబియా సముద్రం, బంగాళాఖాతం సరిహద్దులుగా 7500 కి.మీ పొడవైన సముద్ర తీరప్రాంతం మనకుంది. మానవ వనరులకు కొదవలేదు. విద్యావంతులకు కొరత లేదు. యువతరం భారతదేశానికి పెద్ద వరం. భిన్నమైన భౌగోళిక స్వరూపాలతో, పచ్చని వ్యవసాయ క్షేత్రాలతో, దాదాపుగా ప్రపంచంలో పండే పంటలన్నీ మన దేశంలో పండుతాయి. అభివృద్ధికి అవసరమైన అన్ని అనుకూలాంశాలు భారతదేశంలో ఉన్నాయి. అయితే పరదాస్యం నుండి విముక్తి పొంది 78 సంవత్సరాలకు దగ్గరవుతున్నా, ఆర్థికంగా బలోపేతమవుతున్నా ఇంకా భారతదేశం వర్ధమాన దేశంగానే పరిగణింపబడడంలో ఎలాంటి ఔచిత్యం లేదు.

> **2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ GDP వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు.**

అణుశక్తిలోను, అంతరిక్షంలోను భారత్ ముందంజలో ఉంది. మన ఆర్థిక వ్యవస్థ విలక్షణమైన శైలిని కలిగి ఉంది. భారతదేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో కొనసాగుతున్న భారత ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ సంస్థల కన్నా, ప్రైవేటు సంస్థలే పటిష్ఠమైన చర్యలతో లాభాలను ఆర్జిస్తున్నాయి. భారతదేశం స్థూల జాతీయోత్పత్తిలో సేవారంగం, పరిశ్రమలు, తయారీ రంగం, వ్యవసాయం కీలకభూమిక పోషిస్తున్నాయి.భారతదేశం స్థూలజాతీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా తగ్గుతున్నప్పటికీ, నేటికీ భారతదేశంలోని సుమారు సగం మంది జనాభాకు వ్యవసాయమే ఆధారంగా నిలవడం గమనార్హం. బ్యాంకింగ్, టెక్నాలజీ, హోటల్స్, టెలీ కమ్యూనికేషన్ మొదలైనవి సేవా రంగానికి సంబంధించినవి. భారత జిడిపిలో వ్యవసాయం సుమారు 18% కలిగి ఉంది. భారత ఆర్థిక వ్యవస్థలో 13 నుండి 14% వాటాతో తయారీ రంగం గణనీయమైన భూమిక పోషిస్తున్నది. వచ్చే పది సంవత్సరాల్లో భారత్ జిడిపిలో తయారీ రంగం భాగస్వామ్యం 21 శాతానికి చేరుకుంటుందని ఒక అంచనా.ప్రపంచదేశాలన్నీ ఆర్థికంగా కుదేలైపోతున్న సందర్భంలో భారత్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం విశేషం. జాతీయోత్పత్తి గణనీయంగా పెరిగి భారత ఆర్థిక వ్యవస్థ 4.27 ట్రిలియన్ డాలర్లకు చేరుకుని జపాన్‌ను అధిగమించి, సమీప భవిష్యత్తులో 5 ట్రిలియన్ల యుఎస్ డాలర్లకు చేరడం కష్టసాధ్యంకాదని ఆర్థిక పండితుల అంచనా. దశాబ్దకాలం క్రితం వరకు 10వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠవంతమై త్వరలో 5 ట్రిలియన్ల డాలర్ల మార్కును చేరుకుని మూడవ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని, 2030 నాటికి ఏడు ట్రిలియన్ల డాలర్లతో అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు దీటుగా మారుతుందనే అంచనాలున్నాయి. భారతదేశం ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ దేశాలతో పోటీపడుతూ, ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏర్పడడం ముదావహం. ఐఎంఎఫ్ డేటా ప్రకారం ఆర్థికపరంగా భారత్ తర్వాత స్థానాలను యునైటెడ్ కింగ్ డమ్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, బ్రెజిల్ దేశాలు ఆక్రమించాయి. జిడిపి వృద్ధిరేటు దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టతను సూచిస్తున్నది. అమెరికా తలసరి ఆదాయం 89 వేల డాలర్లు కాగా, భారత్ తలసరి ఆదాయం కేవలం 2936 యుఎస్ డాలర్లు (2 లక్షల 55 వేల రూపాయలు)గా అంచనా వేయబడింది. లగ్జెంబర్గ్, సింగపూర్, ఖతార్, ఐర్లాండ్, నార్వే, స్విట్జర్లాండ్‌లు అధిక తలసరి ఆదాయంతో ధనిక దేశాలుగా పేరొందాయి.దేశ జీడీపీలో ప్రైవేట్ వినియోగం వాటా పెరిగినందున దేశ ఆర్థిక వృద్ధి మరింత సమతుల్యంగా మారుతోందని ఇటీవల విడుదలైన క్రిసిల్ నివేదిక వెల్లడించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ GDP వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు. సాధారణ రుతుపవనాలు, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం, ప్రస్తుత ద్రవ్య చక్రంలో 75100 బేసిస్ పాయింట్ల రేటు కోతలు వంటి అంశాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు.దేశంలో ప్రైవేట్ వినియోగం నానాటికీ పెరుగుతుంది. ఇది ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ, గృహ పెట్టుబడులు రెండూ వేగంగా అభివృద్ధి చెందాయి. అయితే భారత్‌లో కార్పొరేట్ పెట్టుబడులు ఇంకా ఆశించినంతగా పుంజుకోలేదు. కొనసాగుతున్న సుంకాల యుద్ధాలు, చైనా డంపింగ్ భయం కారణంగా కార్పొరేట్ రంగం పెట్టుబడులపై అంతగా ఆసక్తి చూపడం లేదు. టారిఫ్‌ల వల్ల వచ్చే నష్టాల సంక్లిష్టత ఇప్పటికే ప్రారంభమైంది. రాబోయే నెలల్లోనూ ఇది కొనసాగే అవకాశం ఉంది. దీంతో మా అంచనాలకు ప్రతికూలతలు సృష్టిస్తుందని జోషి అన్నారు.2024, 25 మూడవ త్రైమాసికంలో (అక్టోబర్‌డిసెంబర్) జీడీపీ వృద్ధి 6.2 శాతానికి పెరిగింది. ఇది రెండవ త్రైమాసికంలో సవరించిన 5.6 శాతం నుంచి పెరిగింది. 2024, 25 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.5 శాతంగా అంచనా. అయితే 2023, 24 ఆర్థిక వృద్ధి రేటును 12 ఏళ్ల గరిష్టస్థాయి అయిన 8.2 శాతానికి సవరించారు. మరో ముఖ్యమైన పరిణామం ఏమిటంటే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్‌జనవరి) మొదటి 10 నెలలకు ద్రవ్య లోటు రూ. 11.70 లక్షల కోట్లుగా ఉంది. ఇది వార్షిక లక్ష్యంలో 74.5 శాతంగా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి సానుకూల సంకేతాలను చూపడంలో ప్రైవేట్ వినియోగం కీలక పాత్ర పోషిస్తోంది. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి దారితీస్తుంది.

# సీఎం మార్పు తప్పదా..?

■ వరుస కామెంట్స్ పై అనుమానాలు

✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 4:

తెలంగాణలో రోజురోజుకు రాజకీయ పరిణామాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఎప్పుడు ఏ నేత ఏ బాంబు పేలుస్తాడో.. మంటలు రేపే మాటలు ఏం మాట్లాడుతారో అర్థం కాని పరిస్థితి. రాజకీయ పార్టీల్లో చోటుచేసుకునే పరిణామాలు కూడా ఊహించలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో.. త్వరలోనే తెలంగాణ సీఎం మార్పు ఉంటుందని.. తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్తగా నియామకమైన ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ వచ్చింది అదే పని మీద అంటూ బాంబు పేల్చారు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి. మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించిన ఏలేటి.. సంచలన వ్యాఖ్యలు చేశారు.తెలంగాణలో అతి త్వరలోనే ముఖ్యమంత్రి మార్పు ఉంటుందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయంటూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మిషన్ ఛేంజ్ టాస్క్ మీదనే మీనాక్షి నటరాజన్ తెలంగాణకు ఏఐసీసీ ఇంఛార్జిగా వచ్చారంటూ కీలక కామెంట్ చేశారు. డిసెంబర్‌లోపే ముఖ్యమంత్రిని మార్చేందుకు మీనాక్షి రంగం సిద్ధం చేస్తున్నారని సంచలన ఆరోపణ చేశారు. మీనాక్షి నటరాజన్ ను తీసుకురావడం వెనుక ఉత్తమ్ కే కీలక పాత్ర అని అన్నారు. రేవంత్ కి రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ ఇవ్వకపోవడం వెనుక ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారనే చర్చ జరుగుతోందని మీడియాతో అన్నారు ఏలేటి. గతంలో తాను కాంగ్రెస్ లో పని చేశానని ఏలేటి గుర్తు చేశారు. ఢిల్లీలో తనకున్న సోర్స్, కాంగ్రెస్ ఇంటర్నల్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు తానీ వ్యాఖ్యలు చేశానన్నారు. డిసెంబర్‌లో తెలంగాణ సీఎం మార్పు ఖాయమన్నారు. మీనాక్షి నటరాజన్‌కు అదే టాస్క్ అప్పగించారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు ఆమె వచ్చింది అదే పనిపై అన్నారు.ఇప్పటికే సీఎం కుర్చీ మీద భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కన్నేశారంటూ ఆరోపించారు. వనపర్తిలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి.. అక్కడ నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే ఇంకా 20 ఏళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానంటూ చెప్పారని ఏలేటి గుర్తు చేశారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదం కంటే.. ఢిల్లీ నుంచి వచ్చిన ఆడబిడ్డ ఆశీర్వాదమే ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డికి చాలా ముఖ్యమంటూ ఎద్దేవా చేశారు.తెలంగాణలో



కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా గాడి తప్పిందని ఏలేటి విమర్శించారు. మంత్రుల తీరు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉందని మండిపడ్డారు. ఒక్క మంత్రి కూడా సీఎంను లెక్కచేయడం లేదని ఎద్దేవా చేశారు. మంత్రుల పనితీరులోనూ చాలా మార్పులు వచ్చాయన్నారు. ఎవరికీ శాఖల మీద అవగాహన లేదని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు రూ.2500, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, కొత్త రేషన్ కార్డులు.. ఇలా అనేక పథకాలను గంగలో కలిపేశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిని గద్దె దింపేందుకే కింద నెగిటివ్ అయ్యేలా మంత్రులు ప్రవర్తిస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌లో ఏం జరిగేది ఎవరికీ తెలియదంటూ ఏలేటి కీలక వ్యాఖ్యలు చేశారు.ఇదిలా ఉంటే.. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్‌గా మీనాక్షి నటరాజన్ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. ఈ బాధ్యతలు చేపట్టినప్పటిన క్షణం నుంచే.. ఆమె తనదైన స్టైల్‌లో ముందుకెళ్తున్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మీనాక్షీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారరు. ఇప్పటికే.. విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేసిన మీనాక్షి.. కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నట్టు టాక్ నడుస్తోంది. ఈ క్రమంలోనే.. ప్రతిపక్ష నేతలు మీనాక్షి రాక గురించి తమదైన శైలిలో విమర్శలు, ఆరోపణలతో పాటు జోష్యాలు కూడా చెప్పేస్తున్నారు.

# రూ. 30వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు పన్నాగం

■ కాంగ్రెస్ ద్వంద్వ నీతికి, రెండు నాల్కల ధోరణికి మరో ఉదాహరణ అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్


✍ జయభేరి, హైదరాబాద్:

భూముల అమ్మకంపై అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు రేవంత్ క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేసారు. ప్రతీ అంశం లో ప్లేటు ఫిరాయిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూముల అమ్మకం పై కూడా తన నాలుక ను మడత పెట్టి నిస్సిగ్గుగా నిధుల సమీకరణ కోసం వేలాల బాట పట్టిందు. భూముల వేలం పై మారిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని చూసి ఊసరవెల్లి సైతం ఉరి వేసుకునే పరిస్థితి నెలకొన్నది. "ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి అని, తెలంగాణ జాతి సంపద అని, ఆ భూములను అమ్మితే భవిష్యత్తులో స్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందని" నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి మొసలి కన్నీరు కార్చిండని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి ఇపుడు వేల కోట్ల విలువైన భూములను అగ్రాస్ వేసేందుకు తెర లేపిండని అన్నారు. డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కపట బుద్ధిని ఆధారాలతో సహా బయటపెట్టాను. జూన్ 26, 2024 నాడు విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి 75 కోట్ల చొప్పున మొత్తం 30వేల కోట్ల విలువైన భూములను అమ్ముతున్నారని నేను అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టీజీఐఐసీకి చేస్తున్న బూ బదలాయింపు మాత్రమేనని బుకాయించారు. ఆ భూములను అమ్ముకోవాలన్నా మీకు, మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ గారు పదేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధిని ప్రచారం చేసుకోకతప్పడం లేదని అన్నారు.రేవంత్ రెడ్డి గారూ.. సీఆర్ చేసిన అభివృద్ధి మీరు ఎంత ప్రయత్నం చేసి దాచినా దాగదు. అసత్యాలు ప్రచారం చేయడం, ప్రతిపక్షాలను బుకాయించడం వంటివి ఇకనైనా మానుకోవాలని హితవు పలుకుతున్నా. భూములు అమ్మబోమని ప్రజలను, అసెంబ్లీని సైతం తప్పుదోవ పట్టించినందుకు యావత్ తెలంగాణకు క్షమాపణలు చెప్పాలని బీ ఆర్ ఎస్ పక్షాన ప్రభుత్వాన్నిడిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వ భూములు అమ్మితే స్మశానానికి కూడా జాగ ఉండదన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు స్మశానాలకు భూములు ఎక్కడ పుట్టిస్తారో చెప్పాలని అన్నారు.


# కురుమలు అన్ని రంగాల్లో ముందుండాలి

- విద్య తోనే కురుమల బతుకుల్లో వెలుగు
- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**జయభేరి, జగదేవపూర్, మర్చి 04 :**



చదువుతోనే కురుమల జీవితాల్లో వెలుగులు నిండుతాయని హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కురుమ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కొండపోచమ్మ దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమం లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదవాలి ప్రతి ఒక్కరు ఎదగాలని చదివే అందరికీ లక్ష్యంగా మారాలన్నారు. కష్టజీవులుగా ఉన్నా మనము కష్టమైనా చదువును వదలొద్దని అదే మనల్ని సరైన లక్ష్యానికి చేరవేస్తుందన్నారు. అందుకు కొమరవెల్లి మల్లికార్జున స్వామి దర్శించుకున్న ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి శాలువాతో సన్మానం అనంతరం కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తన పూర్వికుల నుండి కొండపోచమ్మ అమ్మవారిని ఇంటిదేవునిగా పిలుస్తున్నామని గతంలో తెలంగాణ కొరకు ఇక్కడ మొక్కుకున్న మొక్కులను ఆయన గుర్తు చేశారు.కొండపోచమ్మ అమ్మవారి వద్ద టీటీడీ బోర్డు ద్వారా ఫంక్షన్ హాలు గెస్ట్ హౌస్ మంజూరు చేపించాలని స్థానిక నేతల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించారు.మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మాట్లాడుతూ కురుమలకు కేంద్ర ప్రభుత్వం సహాయంతో గొంగడి పరిశ్రమలు మిషన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉండ పోచమ్మ అమ్మవారి ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు తన ఎంపీ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధిలో తాను ముందుండి పని చేస్తామన్నారు. ఉన్నితో తయారు చేసే వస్త్రాలను కేంద్ర బలగాలకు హాస్పటల్ కు రైల్వే లకు ఇచ్చే వస్త్రాలను గొంగళ్ళ పరిశ్రమలు ఏర్పాటు చేసి వారికి ఉపాధి చూపించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాదరావు మాట్లాడుతూ కొండపోచమ్మ అమ్మవారు చాలా మహిమగల అమ్మవారు అని ఇక్కడ కోరిన కోర్కెలు తీర్చే ఇంటి ఇలవేల్పుగా లక్షలాదిమంది భక్తిప్రపత్తులతో దర్శించుకునే తెలంగాణలో అతి ముఖ్యమైన దేవాలయం కొండ పోచమ్మ అని టీటీడీ ద్వారా ఫంక్షన్ హాల్స్ దేవాలయ అభివృద్ధి కొరకు ఎంపీ నిధులు కేంద్ర నిధులు తో దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 10 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వకుండా అమ్మవారిని మోసం చేశారన్నారు. కెసిఆర్ మనసుల్ని కాదు దేవుళ్లను మోసం చేసిన వారిలో నిలిచిపోతారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ కురుమ సంఘం నాయకులు పెద్దపురం నరసింహ, మాజీ సర్పంచ్ రమేష్ పులి బాలచంద్రం, కుల బీరయ్య సిద్దల రవి ,సంఘపు అనిల్, కామల్ల భూమయ్య, రాజు, బింగి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.





## నాచారంలో నిర్మిస్తున్న వంతెన పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే

**జయభేరి, ఉప్పల్ :**

నాచారం బాబా నగర్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న నాచారం పెద్ద నాలాపై 94 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను కార్పోరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, అధికారులతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు నాలాకి అడ్డుగా ఉన్న మంచినీటి పైపు తొలగించాల్సిందిగా జలమండలి వారికి తెలియచేసిన కూడా రావడం లేదని చెప్పడంతో అప్పటికప్పుడు జలమండలి జియంతో మాట్లాడి తక్షణమే అడ్డుగా ఉన్న మంచినీటి పైపులైన్ తొలగించాలని ఎమ్మెల్యే సూచించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వంతెన నిర్మాణం నాణ్యతతో నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో EE నాగేందర్, DE బాలకృష్ణ, AE కీర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, జలమండలి మేనేజర్ సిరాజ్, BRS నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న బాక్స్ డ్రైన్ వర్క్ ను జోనల్ కమిషనర్ దృష్టికి



**జయభేరి, కాప్రా :**

మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటన. ఈ సందర్భంగా మీర్పేట్ హెచ్.పీ కాలనీ డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ వెనకాల పెండింగ్ లో ఉన్న బాక్స్ డ్రైన్ వర్క్ ను వారి దృష్టికి తీసుకురాగా ఆ ప్రాంతాన్ని సందర్శించి సానుకూలంగా స్పందించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ యొక్క బాక్స్ డ్రెయిన్ వర్క్ ను రానున్న వర్షాకాలంలోపు పూర్తి చేసినట్లయితే కాలనీవాసులకు ఇబ్బందులకు గురికాకుండా ఉంటుందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న జోన్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే కార్యచరణ చేపడుతామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్, ఈఈ నాగేందర్, డీఈ బాలకృష్ణ, ఏఈ లింగారవు, స్థానిక నాయకులు చారి, బాలయ్య గౌడ్, పూస రమేష్, నిసార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హయత్ నగర్ పరిధిలో ఉన్నటువంటి GVP పాయింట్స్ ను శానిటేషన్ DE నీలిమతో కలసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. GVP పాయింట్స్ వద్ద చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, రాంకీ సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడం వల్ల GVP దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలు కూడా చెత్తాచెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో వెయ్యకుండా కేవలం స్వచ్ఛ ఆటోలో మాత్రమే వైయాలని వారు విజ్ఞప్తి చైయడం జరిగింది. ఈ యొక్క పరిశీలనలో జవాన్ యాదయ్య, రామ్ చందర్, శానిటేషన్ సూపర్వైజర్లు శ్రవణ్, యాదయ్య, రాంకీ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్లోని గాయత్రీ నగర్ లో జరుగుతున్న నూతన సిసి రోడ్ల నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, కాలనీ వాసులు మరియు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణంలో రాభోవు కాలంలో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని వారు అధికారులకు సూచించడం జరిగింది. ఈ పరిశీలనలో AE హేము నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన బ్రాంచ్ ప్రారంభం

**జయభేరి, మేడ్చల్:**

ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో బ్యాంకు అఫ్ మహారాష్ట్ర నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం జోనల్ మేనేజర్ జీఎస్డీ ప్రసాద్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 73 వ బ్రాంచ్ ఈ రోజు ఘట్కేసర్ లో ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు మా బ్యాంకు మిగతా బ్యాంకు ల కంటే నాణ్యమైన సేవలు అందిస్తూ అభివృద్ధి లో ముందజ లో వుంది అన్నారు ఈ బ్రాంచ్ లో కుడా కస్టమర్స్ అందరూ మా సేవలు వినియోగించుకోవాలని చెప్పారు స్టాఫ్ కి కస్టమర్స్ కి శుభాకాంక్షలు తెలియచేసారు.



## కాంగ్రెస్ నేతలు పదవుల కోసం కుమ్ములాట

- కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు
- ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, మర్చి 04 :**

అసమర్థ కాంగ్రెస్ పాలనతో రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి ఆరోపించారు. సాగునీరు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు కేసీఆర్ అండగా నిలబడి జిల్లాలో రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ కొండపోచమ్మ ప్రాజెక్టులను నిర్మించారని కెసిఆర్ పాలనలో మండుటెండల్లో సైతం మత్తడి దుంకి నీళ్లు ప్రవహించేవని ఆయన అన్నారు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటూ రైతులకు సాగునీరు ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి అన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి నిరంతరాయంగా త్రాగునీరు అందించామని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎండాకాలం రాకముందే ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నేతలు పదవుల కోసం కుమ్ములాడుకుంటూ నియోజవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఘాటుగా విమర్శించారు. పంటలు ఎండిపోక ముందే రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## టన్నెల్ లో నీటి ఊట...

**జయభేరి, మహబూబ్ నగర్, మార్చి 4:**

ఎస్ఎల్బీఎస్ రెస్క్యూ ఆపరేషన్ 11 వ రోజు కూడా కొనసాగుతూనే ఉంది. సొరంగంలో చిక్కిన 8 మంది జాడ ఇప్పటి వరకూ కనిపించనే లేదు. జీపీఆర్ పరికరం గుర్తించిన 8 ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగుతున్నాయి. రాడార్ గుర్తించిన 4 చోట్ల.. 5 నుంచి 12 మీటర్ల మేర బురద, మట్టి పేరుకుపోయింది. పలు చోట్ల రంధ్రాలు పడటంతో నీరు ఊరుతోంది. కన్వేయర్ బెల్ట్‌ను పునరుద్ధరించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఈ తవ్వకాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఐ సింగరేణి కార్మికుల బృందాలు ముమ్మరంగా శ్రమిస్తున్నాయి. భారీగా వస్తున్న ఊట నీటి కారణంగా.. పదే పదే ఆటంకాలు కలుగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే.. ఊట నీటిని హెవీ మోటార్ల సాయంతో.. బయటకకు పంపింగ్ చేస్తున్నారు. టీబీఎం మిషన్ కటింగ్ పనులు తుదిదశకు చేరుకోనున్నాయి. ఉత్తరాఖండ్ ఆపరేషన్లో కీలక పాత్ర పోషించిన.. ర్యాట్ హోల్ మైనర్స్ ద్వారా ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇక కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ కోసం డ్రిల్లింగ్ పనులు చేపట్టగా..సాయంత్రానికి ఈ కన్వేయర్ బెల్ట్ బెల్ట్ సిద్ధం కానుంది. భూ ప్రకంపనలపై 14వ కిలోమీటర్ దగ్గర భూ ఉపరితలంపై సర్వే చేపట్టారు. 4 షిఫ్టులలో 70 మందితో ఈ మొత్తం ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈ ఆపరేషన్ పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా కలెక్టర్, ఎస్పీ చూస్తున్నారు.కలన్వేయర్ బెల్ట్ రిపేర్ పూర్తయ్యే అవకాశం ఉంది. కన్వేయర్ బెల్టు అందుబాటులోకి వస్తే రెస్క్యూ ఆపరేషన్ మరింత స్పీడప్ కానుంది. అయితే రెస్క్యూ ఆపరేషన్‌కు నీటి ఊట అడ్డంకిగా మారుతున్నట్లు కనిపిస్తోంది. టీబీఎంమిషన్ వెనుక పెద్ద ఊబి ఉందంటున్నారు అధికారులు. 13.5 కిలో మీటర్ దగ్గర నీటి ఊట ఎక్కువగా ఉందని చెబుతున్నారు. టీబీఎం మిషన్‌ని పూర్తిగా తొలగిస్తేనే 8 మంది కార్మికుల జాడ తెలిసే చాన్స్ ఉందంటున్నారు అధికారులు. అనేక పరికరాలతో రెస్క్యూ టీం స్కానింగ్ చేస్తున్నాయి. ఒక్కో షిఫ్టులో 70 మంది పని చేస్తున్నారు. టీబీఎం మిషన్ కటింగ్ పనులు అనుకున్నంత వేగంగా ముందుకు సాగడం లేదు. ప్లాస్మా కట్టర్స్ ఉపయోగించినా కూడా ఐరన్ చాలా స్ట్రాంగ్‌గా ఉండటంతో కటింగ్ పనులు కష్టంగా ఉన్నాయి. మరోవైపు నీళ్లు, బురద వేగంగా రావడంతో సమస్య జటిలంగా మారుతోంది. అయితే గంటలు.. రోజులు గడుస్తున్నా.. పరిస్థితిలో ఆశించినంతగా మార్పు కనిపించడం లేదు.

# ఈ విజయంతో బిజెపి పై నమ్మకం బలపడింది

**జయభేరి, హయత్ నగర్ :**



ఉమ్మడి మెదక్ నిజామాబాద్ఆదిలాబాద్ కరీంనగర్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలో బిజెపి అభ్యర్థి మల్కా కొమరయ్య ఘన విజయం సాధించిన సందర్భంగా హయత్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీను ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని బాణాసంచి కాల్చి, కార్యకర్తలకు మిఠాయిలు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ నిజామాబాద్ అదిలాబాద్ కరీంనగర్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన మల్క కొమరయ్యకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలపడంతో పాటు, ఈ విజయంతో ఉపాధ్యాయ లోకంలో బిజెపిపై ఉన్న అపారమైన విశ్వాసం, నమ్మకం మరింత బలపడిందని, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక పార్టీ బిజెపి తప్ప, మిగతా పార్టీలు పోటీ చేయడానికి కూడా ధైర్యం చేయలేకపోయాయి. బిజెపికి సదా అండగా నిలిచిన తెలంగాణ ఉపాధ్యాయ కుటుంబానికి, నిత్యం శ్రమించిన పార్టీ కార్యకర్తలకు వారు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలపడం. ఈ సంబరాలలో బీజేపీ జిల్లా sc మోర్చా ప్రధాన కార్యదర్శి పొరంద మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు యాదగిరి, జిల్లా నాయకులు జంజ్య నాయక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, గంగాని రాము, జనార్దన్, వస్పరి వెంకటేష్, బాలు, సురేష్, శక్తి సింగ్, శ్రీధర్, కృష్ణ,నర్సింహా, అరుణ్, బీజేవైఎం అధ్యక్షులు ప్రేమ, భారత్, విష్ణు, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెటా ప్లస్ అనే ఆన్లైన్ సంస్థ పేరుతో భారీ దోపిడి

**జయభేరి, ఖమ్మం :**



ఖమ్మం నగరానికి చెందిన దొండేటి శ్రీదేవి అలియాస్ నందు అండ్ కారేపల్లి చెందిన నంద్రు సురేష్ అండ్ షేక్ నజీర్పాషా నవీన్ అనే వ్యక్తులు మెటా ప్లస్ లో పెట్టుబడులు పెడితే ఒక లక్షకు 10 లక్షలు వస్తాయని గిరిజన ప్రాంతాలలో ఏజెన్సీ ప్రాంతాలలో అమాయక ప్రజలను నమ్మించి భారీ మోసాలకు పాల్పడ్డారని బాధితులు వాపోతున్నారు ఒక తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్ గుజరాత్ మహారాష్ట్ర పలు రాష్ట్రాలలో దేశవ్యాప్తంగా మెటా ప్లస్ అనే సంస్థ పేరుతో సుమారుగా 100 కోట్ల దోపిడీ జరిగిందని బాధితులు అంటున్నారుతెలంగాణలోని తిరుమలాయపాలెం ఖమ్మం నగరానికి సంబంధించిన వ్యక్తులు దీంట్లో బాధితులు కారేపల్లి పాల్వంచ భద్రాద్రి కొత్తగూడెం జూలూరుపాడు టేకులపల్లి ఇల్లందు మిర్యాలగూడ కరీంనగర్ మహబూబ్నగర్ ఆంధ్ర ప్రదేశ్ కాకినాడ రాజమండ్రి పలు ప్రాంతాల్లో అమాయకుల ప్రజలకు వలవేసి మొదటగా విదేశీ ప్రయాణాల పేరుతో దుబాయ్ తీసుకెళ్తామని నమ్మబలికి ముందుగా కొంతమందిని నమ్మించడానికి గోవా ప్రాంతానికి తీసుకెళ్లి మూడు నాలుగు రోజులు మందు పార్టీలతో క్లబ్బులు ఏర్పాటు చేసి గోవా వెళ్లి వచ్చిన వాళ్ళు మిగతా ప్రజలకు మోటివేట్ చేసి లక్షల రూపాయలు సంస్థలో పెట్టుబడి పెట్టాలనిఅమాయక ప్రజలను నమ్మించి ఒక్కొక్కరి నుండి ఆరు లక్షలు వసూలు చేసి అధిక లాభాలు వస్తాయని ప్రజలు బయట ప్రైవేటు బ్యాంకుల లో ఐదు రూపాయల వడ్డీకిడబ్బులు తీసుకొని మెటా ప్లస్ అనే సంస్థలో పెట్టుబడి పెడితే సంస్థ మోసం చేయడం వల్ల కుటుంబాలు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు సుమారుగా 100 కోట్లకు పైగా దోపిడీ చేశారని స్టేషన్లో బాధితులు టేకులపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్సైపోగుల సురేష్ను కలిసి కంప్లైంట్ ఇవ్వడం జరిగింది కావున మెటా ప్లస్ అని ఆన్లైన్ సంస్థ పేరుతో దోపిడీ చేసిన నయవంచకులు ఖమ్మం నగరానికి చెందిన ఎస్కే నజీర్ పాషా దొండేటిశ్రీదేవి అలియాస్ నందు కారేపల్లి నగరానికి చెందిన నంద్రు సురేష్ ఖమ్మం నగరానికి చెందిన నవీన్ వినోద్ అనే వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయవలసిందిగా కోరుతున్నారు.

## కూకట్ పల్లిలో గ్యాస్ పేలుడు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 4:**

నగరంలో వరుస అగ్ని ప్రమాదాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. నిత్యం ఏదొక ప్రదేశంలో వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా హైదరాబాద్ లోని రెండు చోట్ల భారీ అగ్నిప్రమాదాలు జరిగాయి. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ కూకట్ పల్లిలో గ్యాస్ సిలిండర్ పేలింది. పెద్ద సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లలో అక్రమంగా గ్యాస్ నింపుతుండగా ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా భారీ పేలుడు శబ్దం విన్న జనం.. భయంతో పరుగులు తీశారు.అయితే సమయంలో స్థానికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. ఈ పేలుడు ధాటికి షాపు మొత్తం ధ్వంసం అయ్యింది. ఈ ఘటనలో గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న శంకర్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. గతంలో హైదరబాద్ నగరంలో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్లు జరుగుతున్నాయని ఇటీవల పలు కేసులు నమొదయ్యాయి. మరి ఇలాంటి అక్రమంగా రవాణా చేస్తున్న ఆ గ్యాస్‌కి సంబంధించి సిబ్బంది ఎవరైతే ఉన్నారో.. వారందరిని అదుపులోకి తీసుకుని.. పోలీసులు ఏ విధంగా విచారిస్తారో.. వారిని అరెస్టు చేస్తారా..? ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తారా? అనేది వేచి చూడాల్సిందే. ఇక నివాసాల వద్ద ఇటువంటి ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేసే షాపులను గుర్తించి.. కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారుఇదిలా ఉంటే.. హైదరాబాద్ అంబర్‌పేటలో అగ్ని ప్రమాదం జరిగింది. ఫ్లై ఓవర్ కింద ఉన్న ఓ రేకుల షెడ్డులో మంటలు ఎగసిపడ్డాయి. భారీగా మంటలు చెలరేగడంతో ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనాస్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు



## జర్నలిస్టు సంతోష్ మృతి విచారకరం

- తక్షణ సహాయం కింద కాప్రా ప్రెస్ క్లబ్ నుంచి రూ .10,000 ఆర్థిక సహాయం

**జయభేరి, కాప్రా :**

మిత్రుడు, సీనియర్ జర్నలిస్టు, S1tv రిపోర్టర్ కమల్ సంతోష్ గౌడ్ అకాల మృతి పట్ల TUWJIJU రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, కాప్రా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వేముల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విజయ్ కుమార్, కోశాధికారి రుద్రగొని నర్సింగ్ గౌడ్ తో పాటు పలువురు జర్నలిస్టులు సంతోష్ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సంతోష్ మృతి బాధాకరమని పేర్కొంటూ ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వం తరపున ప్రెస్ అకాడమీ నుంచి తగిన సహాయం అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. తక్షణ సహాయం కింద కాప్ర ప్రెస్ క్లబ్ నుంచి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు చుక్కరమేష్, రమేష్ యాదవ్, సత్యం, రాము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుదర్శనచక్ర శిఖర ప్రతిష్ట ఆహ్వాన పత్రిక అందజేత

- మాజీ ఎంపీపీ పాండు గౌడ్, ఆలయ వ్యవస్థాపకులు హనుమంతరావు, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి



**జయభేరి, మార్కుక్, మర్చి 04 :**

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో ఈనెల 7,8,9,10వ తేదీలలో జరిగే వార్షికోత్సవం సందర్భంగా 9వ తేదీన సుదర్శనచక్ర శిఖర ప్రతిష్ట కార్యక్రమం ఆహ్వాన పత్రిక ను తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు,మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు శనివారం రోజు ఎర్రవల్లి లోని కేసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో అందజేసిన మాజీ ఎంపీపీ పాండు గౌడ్,ఆలయ వ్యవస్థాపకులు హనుమంతరావు వారితోపాటు డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి,బేతి నరేందర్ రెడ్డి,తాండ శ్రీనివాస్ గౌడ్,ఉప్పరి నర్సింగరావు,ఆంజనేయులు,మ్యాకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## జిఎంఆర్ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం




**జయభేరి, గజ్వేల్, మర్చి 04 :**

గజ్వేల్ మండలం సంగాపూర్ గ్రామంలో గల జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం ఆర్గనైజర్ మ్యాజిక్ భాస్కర్ మీడియా కోఆర్డినేటర్ జంగం బాల ప్రకాష్ తెలిపారు. జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదివినా 19882000 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన గురువులను సత్కరించడం జరుగుతుందని వారు తెలిపారు. ఆయా సంవత్సరాల లో కళాశాలలో చదివినా పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున మహా సమ్మేళనానికి హాజరుకావాలని వారు కోరారు. పాలిటెక్నిక్ కళాశాలలో చదివి వివిధ హోదాలలో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం ఇతర రాష్ట్ర దేశాల నుండి సమ్మేళనానికి హాజరుకానున్నట్లు వారు చెప్పారు.

## మార్కుక్ లో పేకాట స్థావరం పై పోలీసుల దాడి



**జయభేరి, మార్కుక్, మర్చి 04 :**

మర్కుక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్కుక్ గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, మర్కుక్ పోలీసులు వెళ్లి రైడ్ చేసి 05 వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయినారు. వారి వద్ద నుండి 8,590/ వేల రూపాయలు, 05 మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడిన వారు మార్కుక్ గ్రామానికి చెందిన వారు గా గుర్తించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణాలలో ఫామ్ హౌస్ లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు.

# కనీస వేతనం 26 వేలు నిర్ణయించాలి

- 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను వెంటనే విడుదల చేయాలి
- కార్మిక శాఖ ఉప కమిషనర్ కు వినతి పత్రం
- సందబోయిన ఎల్లయ్య, సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు

**జయభేరి, గజ్వేల్, మర్చి 04 :**




కార్మికులందరికీ కనీస వేతనాలను రూ 26 వేలు నిర్ణయించాలని, 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలన్నింటినీ విడుదల చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు గజ్వేల్ ఇండస్ట్రియల్ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ రవీందర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతన జీవోల కాలం ముగిసి 15 సంవత్సరాలు అయినా వాటిని కొనసాగించడం జరుగుతుందని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల యొక్క జీవన అవసరాలు పెరిగి రోజువారి , గృహ అవసరాలు విద్యా వైద్యం, ఇంటి అద్దెలు ఖర్చులు పెరిగాయని అన్నారు కానీ వస్తున్న వేతనాలు మాత్రం గొర్రె తోక బెత్తడు చందంగా మారాయని అన్నారు దీంతో కుటుంబ అవసరాలు తీరాకపోవడంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోవడం జరుగుతుందని అన్నారు 2005 నుండి ఇప్పటివరకు నిత్యవసర సరుకుల ధరలు అనేక రేట్లు పెరిగాయని అన్నారు మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు గజ్వేల్ నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతాలలో కనీస వేతనాలు, ఈఎస్ఐ,పిఎఫ్ గుర్తింపు కార్డులు, బ్యాంకు ద్వారా వేతనాలు అమలు కావడంలేదని, యజమాన్యాలు కార్మికులందరినీ తీవ్రమైన శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. వస్తున్న వేతనంలో నుండే రోజువారి ప్రయాణ ఖర్చులు 100 నుండి 150 రూపాయలు వెళుతున్నాయని అన్నారు పరిశ్రమల్లో కనీస వసతులు మంచినీళ్లు, మరుగుదొడ్లు షూస్, మాస్కులు, భద్రత సౌకర్యాలు కలిగించడం లేదని ప్రభుత్వం పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. 12 గంటల పాటు బలవంతంగా పనిచేపిస్తూ కార్మికులను మానసిక వేధింపులకు గురి చేయడం జరుగుతుందని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేదని, వేధింపులకు పాల్పడడం జరుగుతుందని అన్నారు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రత్యక్ష కార్యచరణ కు దిగుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, నాయకులు రాములు జహంగీర్ ఆంజనేయులు యాదగిరి స్వామి కనుకయ్య ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా అక్రమ నిర్మాణాలు

- చోద్యం చూస్తోన్న సంబంధిత అధికారులు
- గ్రామసభలో అక్రమ నిర్మాణాలపై గళమెత్తిన గ్రామస్తులు

**జయభేరి, మర్చి 04:**




అలియాబాద్ గ్రామంలో అక్రమ నిర్మాణాలు, రహదారి ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. తాజాగా గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఈ వ్యవహారంపై పలువురు గళమెత్తారు. అనంతరం గ్రామ ప్రత్యేక అధికారి గీతారెడ్డిని కలిసి వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలోని అలియాబాద్ రిక్వెస్ట్ బస్టాప్ నుండి మజీద్ పూర్ వరకు గల గ్రామ నక్ష రొడ్డును కొందరు కబ్జా చేస్తున్నారని వారు ఆరోపించారు. అయితే ఈ విషయమై సంబంధిత అధికారులను కలిసి సమస్యను విన్నవించి వినతి పత్రం సమర్పించిన కూడా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోయారు. ఇక విదర్భ లో నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తున్నారని అయితే ఇవి ఏర్పాటు చేసే ముందు ఎవరి అనుమతులు తీసుకుని వేస్తున్నారని వారు ప్రశ్నించారు. అంతేకాక ఫుట్ పాత్ లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న పట్టించుకోరా అంటూ వారు నిలదీశారు. అంతేకాక గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ సమస్యలపై పంచాయితీ కార్యదర్శికి విన్నవించినా కూడా పట్టించుకోక పోగా కొందరికి వత్తాసు పలుకుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు కంఠం కృష్ణా రెడ్డి, కుమార్ యాదవ్, మాజి ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజి వార్డు సభ్యులు బండి రాంరెడ్డి, గోపి, రాజు, మాజి డైరెక్టర్ మేడి మల్లేష్, నాయకులు సంజీవ్ రెడ్డి, రమేష్, భిక్షపతి, మధుసూదన్ రెడ్డి, సుధాకర్, మల్లేష్ యాదవ్, అశోక్, బాలేష్, యాదగిరి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# మొదటి హునర్ స్టూడెంట్ కనెక్ట్ సెంటర్ ప్రారంభం

- మహిళల కోసం కొత్త దిశ, దేవరకొండలో తెలంగాణలో మొదటి హునర్ స్టూడెంట్ కనెక్ట్ సెంటర్ ప్రారంభం

**జయభేరి, దేవరకొండ :**



భారతదేశంలోని మహిళలను ఆత్మనిర్భరంగా మార్చేందుకు ఒక అద్భుతమైన ప్రయత్నంగా, నిష్ఠా యోగేశ్ ప్రారంభించిన హునర్ ఆన్‌లైన్ కోర్సెస్ ప్రస్తుతం ఒక కొత్త విజయపథం వైపు అడుగులేస్తోంది. ఈ ప్రయత్నం అంగీకారం పొందిన భాగంగా, నల్గొండ జిల్లాలోని దేవరకొండ లో తొలి హునర్ స్టూడెంట్ కనెక్ట్ సెంటర్ ప్రారంభించబడింది. ఈ సెంటర్ ప్రారంభం హునర్ ఆన్‌లైన్ కోర్సెస్ యొక్క విజయవంతమైన విద్యార్థిని రూపీనా సహకారంతో ఆమె బుటిక్ "న్యూ స్థాయి సారీ సెంటర్" వద్ద జరిగింది. ఈ కార్యక్రమంలో హునర్ ఆన్‌లైన్ మేనేజర్ నిఖిలా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సెంటర్ మహిళలకు ఆత్మనిర్భరత వైపు కీలకమైన అడుగులు వేయడంలో సహాయం చేస్తుంది. ఈ కేంద్రం మహిళలకు హునర్ ఆన్‌లైన్ గురించి అవగాహన కల్పించడం, వారి నైపుణ్యాలను పెంపొందించడంలో మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పనిచేస్తుంది. అదేవిధంగా, ఈ కేంద్రంతో మహిళలు ఆర్థికంగా బలపడే అవకాశాన్ని పొందవచ్చు. హునర్ ఆన్‌లైన్ కోర్సెస్ యొక్క కోలాబొరేషన్ మేనేజర్ విజయ దూబే చెప్పారు, "మా కోర్సుల ద్వారా భారత దేశంలోని వివిధ రాష్ట్రాల మహిళలు ఇంట్లోనే ఫ్యాషన్, ఫుడ్, బ్యూటీ వంటి రంగాలలో తమ నైపుణ్యాలను పెంచుకుంటూ, ఒక స్థిర ఆదాయాన్ని పొందుతున్నారు." హునర్ ఆన్‌లైన్ కోర్సెస్‌లో 55కి పైగా ప్రభుత్వ ధృవీకృత కోర్సులు అందుబాటులో ఉన్నాయి, ఇవి మూడు నెలల నుండి ఆరు నెలల వరకు ఉంటాయి. ఈ కోర్సుల్లో చేరిన మహిళలు తమ సౌకర్యం మేరకు ఈ కోర్సులను తీసుకోగలుగుతారు. ప్రత్యేకంగా, హునర్ ఆన్‌లైన్ కోర్సెస్ ఇతర సంస్థలతో పోలిస్తే చాలా కిఫాయితీగా ఉంటాయి. మూడు నెలల కోర్సు కేవలం 3,000 రూపాయలకూ, ఆరు నెలల కోర్సు 10,000 రూపాయలకూ అందుబాటులో ఉంది. ఇప్పటివరకు, 50,000కి పైగా మహిళలు ఈ కోర్సులను పూర్తిచేశారు, అనేక మంది తమ స్వంత వ్యాపారాలు ప్రారంభించారు. ఈ ప్రయత్నం ద్వారా మహిళలు నెలకు 60,000 రూపాయల నుండి 1,00,000 రూపాయల వరకు ఆదాయం పొందుతున్నారు. హునర్ ఆన్‌లైన్ కోర్సెస్ తో నితా లుల్లా, శిల్పా శెట్టి కుమద్రా వంటి అనేక ప్రముఖ వ్యక్తులు కూడా జత కట్టారు, ఇవి ఈ ప్రయత్నాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి. ఈ సెంటర్ మహిళలను తమ కలలను నెరవేర్చడంలో మరియు ఆత్మనిర్భరం అయ్యే దిశగా ప్రేరణగా నిలుస్తుంది, మరియు హునర్ ఆన్‌లైన్ ద్వారా వారు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ఒక కొత్త దిశలో ముందుకు సాగవచ్చు.

# ప్రకృతికి ప్రతిరూపాలే గ్రామదేవతలు


**జయభేరి, వర్గల్, మర్చి 04 :**



వర్గల్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు వైభవంగా జరుగుతుండగా, మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహాముని కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కళ్యాణ వేదికపై అధిష్టింపజేశారు.

అనంతరం రెండు గంటల పాటు జరిగిన కళ్యాణ మహోత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

కాగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, నిర్వహించారు. ఆయితే గ్రామాల్లో ప్రకృతికి ప్రతిరూపాలుగా గ్రామ దేవతలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తుండగా, అమ్మవారి ఆశీస్సులతో పిల్లా పాపలు సంతోషంగా ఉంటారని, పాడి పంటలు సంవృద్ధిగా పండుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతిఏటా ఉత్సవాలు నిర్వహిస్తుండగా, గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తాళ్ల ప్రభుదాస్ గౌడ్, మక్తాల యాదగిరి గౌడ్, గజ్వేల్ బాల్ కిషన్ గౌడ్, కొండల్ గౌడ్, మహేందర్ గౌడ్, జహంగీర్ గౌడ్, తౌటి కిష్టయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. లోక కళ్యాణార్థం ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పిటిసి తాళ్ల సుధారాణి ప్రభుదాస్ గౌడ్ పేర్కొన్నారు.






## స్వయం సహాయక సంఘాలకు బస్సులు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 4:**

తెలంగాణ ప్రభుత్వం మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయిస్తూ జీవో జారీ చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున 150 బస్సులను మహిళా సంఘాలకు అందివ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల కేటాయింపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలకు బస్సులను కేటాయిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. తొలి విడతలో 150 మండల సమాఖ్యలకు బస్సులు కేటాయించనున్నారు. త్వరలో మిగిలిన 450 సమాఖ్యలకు ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వనున్నారు. ఒక్కో బస్సుకు రూ.77,220 అద్దె చెల్లించనుంది తెలంగాణ ఆర్టీసీ. ఈ బస్సుల కొనుగోలుకు కూడా ప్రభుత్వమే బ్యాంకు గ్యారంటీ ఇవ్వనుంది. దేశంలోనే తొలిసారిగా స్వయం సహాయక సంఘాలకు అద్దె ఆర్టీసీ బస్సులు రానున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న పరేడ్ గ్రౌండ్ వేదికగా 50 బస్సులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలంగాణ ప్రభుత్వం విశ్వసిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు అనేక పథకాలు, కార్యక్రమాల ద్వారా సహాయం అందిస్తుంది.బ్యాంకు లింకేజీ ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తుంది. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఉపాధి అవకాశాలు కల్పించడానికి సహాయపడుతుంది. మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తుంది. ప్రభుత్వం "మహిళా శక్తి" పేరుతో పలు రకాల కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని 4.32 లక్షల సంఘాల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారుచేశారు.గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల్లో 1015 మంది మహిళలు ఉంటారు. సభ్యులు క్రమం తప్పకుండా సమావేశమై, పొదుపు చేస్తారు. పొదుపు చేసిన మొత్తాన్ని సభ్యులకు అవసరమైనప్పుడు రుణంగా ఇస్తారు. ఇవే కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుంటారు. గ్రామంలో సంఘాలు అన్ని కలిపి వీవో (గ్రామ సమాఖ్య) కింద పనిచేస్తాయి. మండల స్థాయిలో.. మండల సమాఖ్య ఉంటుంది. జిల్లా స్థాయిలో.. జిల్లా సమాఖ్య ఉంటుంది.ప్రస్తుతం ప్రభుత్వం మండల సమాఖ్యలకు బస్సులు అందజేస్తోంది. తొలుత 150 మండలాలకు అందివ్వనున్నారు. వీటి పనితీరు, ఆదాయం పరిశీలన తర్వాత అన్ని మండలాలకు విస్తరింపజేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆర్టీసీలో ప్రైవేట్ బస్సులకు అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పుడు మండల సమాఖ్యలకు ఇవ్వడం ద్వారా ఆ ఆదాయం మహిళలకు వెళ్లనుంది. మండల సమాఖ్యల అధ్యక్షురాళ్లు, కార్యదర్శులు, కోశాధికారులు వీటిని పర్యవేక్షించే అవకాశం ఉంది.



# మహిళలను గౌరవించే చోట దేవతలు కొలువై ఉంటారు

- సీపీ సుధీర్ బాబు
- అన్ని రంగాలలోనూ పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



**జయభేరి, హైదరాబాద్ :**

నాగోల్ లోని పిబిఆర్ కన్వెన్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల రాచకొండ పోలీసు మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమీషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ.. మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. తమ జీవితంలో ఎన్నోరకాల వివక్షలను ఎదుర్కొంటూ, వారి ప్రతిభను ప్రదర్శించడంలో ఎదురైన అవరోధాలను అధిగమిస్తూ అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. మన దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని, లాయర్లుగా, పోలీసు అధికారులుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, విద్యావేత్తలుగా, మరెన్నో ఇతర రంగాల్లో పని చేస్తూ తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని దేశాభివృద్ధికి అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలను గౌరవించడం మన భారత ఉపఖండంలో ఉన్న గొప్ప విషయం అని, మన దేశంలోనే కాక పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ లో కూడా స్త్రీలు అధ్యక్ష, ప్రధాని పదవులు నిర్వహించే స్థాయికి చేరుకున్నారని గుర్తు చేశారు.

మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ సమాన హక్కులు ఉన్నాయని, మహిళా అధికారులందరూ తమ పూర్తి శక్తితో పని చేయాలని, తమ కలల సాకారం కోసం అహర్నిశలూ పాటుపడాలని సూచించారు. పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ అని, రాచకొండ పోలీసు కమిషనరేట్ లో పలు విభాగాల్లో వందల మంది మహిళలు సమర్థవంతంగా పని చేయడం పట్ల కమీషనర్ హర్షం వ్యక్తం చేశారు. రిసెప్షన్ వంటి క్లరికల్ బాధ్యతలు మాత్రమే కాక ఎస్ఓటీ, ట్రాఫిక్, క్రైమ్ వంటి విభాగాల్లో కూడా క్లిష్టమైన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, గృహ హింస, వైవాహిక వివాదాలలో బాధితులైన మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అనేక రకాల విధులను మహిళా పోలీసు అధికారులు నిర్వహిస్తున్నారని అభినందించారు.

మహిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న సేవను పేర్కొంటూ, మహిళలు పలు రంగాలలో సాధిస్తున్న విజయాలు రానున్న తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, మహిళా అధికారులందరూ ధైర్యంగా ఉండాలని, తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని సూచించారు. రాచకొండ కమిషనరేట్ మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మల్కాజీగిరి పద్మజ ఐపీఎస్, డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర ఐపిఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డీసీపీ అడ్మిన్ ఇందిర, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి రోడ్ సేఫ్టీ మనోహర్, డిసిపి ట్రాఫిక్ 1 మల్లారెడ్డి, డిసిపి ట్రాఫిక్ 2 శ్రీనివాసులు, డీసీపీ వుమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రిలతో పాటు పలువురు రాచకొండ కమిషనరేట్ మహిళా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# రివర్స్ గేర్ లో ఆర్మూర్ కార్

**జయభేరి, నిజామాబాద్, మార్చి 4:**

ఆ జిల్లా బీఆర్ఎస్‌కి కంచుకోట. కానీ ఇప్పుడు ఆ జిల్లాలో పార్టీ క్యాడర్‌కి ధైర్యం చెప్పే బాస్ కరువయ్యాడట. గత 10 ఏళ్లలో 8 నుంచి 9 ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకున్న గులాబీ పార్టీ పరిస్థితి అక్కడ అంత దయనీయంగా ఎందుకు తయారైంది? ఆ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు ఎందుకు ముఖం చాటేస్తున్నారు?. పార్టీ అధినేత ఆదేశాలను సైతం ఎందుకు పట్టించుకోవడం లేదునిజామాబాద్ జిల్లాలో తాజా మాజీ ఎమ్మెల్యేల తీరు పై.. గులాబీ క్యాడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉంటే.. నేతలు నియోజకవర్గానికి ముఖం చాటేస్తుండటం కార్యకర్తలకు మింగుడు పడటం లేదంట. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిస్తే జిల్లాలో సగానికి పైగా నియోజకవర్గాల్లో అసలు ఉలుకు పలుకే ఉండటం లేదంట. బాల్కొండ లో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అడపాదడపా నియోజకవర్గంలో పర్యటిస్తూ క్యాడర్‌ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.కామారెడ్డిలో బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అయినట్లే అంటున్నారట. బాన్సువాలో మాజీ మంత్రి, మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికార పార్టీలో చేరి కారు టైర్లను పంచర్ చేశారు. దాంతో అక్కడ గులాబీ పార్టీకి లీడర్ లేకుండా పోయాడు. ఆర్మూర్‌లో మొక్కుబడిగా కనిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కేసీఆర్ ఫామౌస్‌లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారంట. బోధన్‌లో మాజీ ఎమ్మెల్యే షకీల్ అయితే ఓడినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గం ముఖం చూడలేదు. షకీల్ దుబాయ్‌కి పరిమితం అవ్వడంతో ఆయన భార్య భార్య అయేషా ఫాతిమా ఇన్చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే రాజకీయాలకు పూర్తిగా కొత్త అయిన ఆమె క్యాడర్‌ని కపడుకోలేక పోతున్నారు.ఇక నిజామాబాద్ అర్బన్, రూరల్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నేతలు కేటీఆర్ ఆదేశాలను కూడా లైట్ తీసుకున్నారట. ముందుండి నడిపించే నాయకుడు లేక పోవడంతో ఆ నియోజకవర్గాల్లో పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను కూడా నిర్వహించే దిక్కు లేకుండా పోయిందంట. జామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ దాదాపుగా ఖాళీ అయ్యిందట. మొన్నటి వరకు మేయర్‌గా బీఆర్ఎస్ నాయకుడు కొనసాగినప్పుడు అంతో ఇంతో హడావుడి కనిపించేది. అయితే కౌన్సిల్ కాలం చెల్లి మేయర్ పదవీ కాలం అయిపోవడంతో అర్బన్‌లో పార్టీకి లీడర్ లేకుండా పోయాడంట. మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్‌గుప్తా పార్టీని వీడే వారిని బుజ్జగించే ప్రయత్నం కూడా చేయడం లేదంట.నిజామాబాద్ రూరల్ లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి అనంతరం. నియోజకవర్గం లోనే ఉన్నప్పటికీ.. ఆయన యాక్టివ్‌గా లేకపోవడంతో గులాబీ క్యాడర్ మొత్తం హస్తం గూటికి క్యూ కట్టారట. అధిష్టానం ఇప్పుడు రూరల్ నుంచి కాకుండా గతంలో బాన్సువాడ ఎమ్మెల్యే గా అనుభవం ఉన్న బాజిరెడ్డిని మళ్ళీ వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచే పోటీ చేయాలని చెపుతున్నా.. ఆయన సుముఖంగా లేరన్న ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ క్యాడర్ని ఉత్సాహపరచడానికి జిల్లాలో పర్యటిస్తున్నా.. నేతలు, వారి సహకారం కరువవ్వడంతో పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టు అన్నట్లు తయారైందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.. ఓవరాల్‌గా చూస్తే జిల్లాలో కారు .. రివర్స్ గేర్లో .. ఫుల్ స్పీడ్‌తో.. పరుగులు పెడుతున్నట్లు కనిపిస్తోందిప్పుడు.

# నోరూరించే హలీమ్ రుచులు

- కేవలం రంజాన్ మాసంలో దొరికే నోరూరించే వంటకం ఈ హలీమ్



**జయభేరి, దేవరకొండ :**

రంజాన్ మాసం వచ్చిందంటే చాలు దేవరకొండలో నోరూరించే హలీమ్ తయారీ ప్రారంబం అవుతుంది.ఉపవాసాలు ఉండే ముస్లిం సోదరులే కాకుండా హిందూ సోదరులు కూడా చాలా ఇష్టపడి తింటారు, హలీం లో అన్ని రకాల పోషకాలు ఉండటం ద్వారా రోజంతా ఉపవాస దీక్షలో ఉండి శక్తిని కోల్పోయిన వారు హలీమ్ ద్వారా శరీరంలో కొంత మేరకు శక్తిని పొందగలుగుతారు.రంజాన్ మాస సందర్భంగా దేవరకొండ పట్టణంలో షేక్ మదర్ అండ్ సన్స్ ఆధ్వర్యంలో హలీం సెంటర్ ను ఏర్పాటు చేశారు. దేవరకొండ పట్టణ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎదురుగా ఏర్పాటుచేసిన హలీం సెంటర్ యజమాని షేక్ మధార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో రుచికరమైన హలీమ్ అందించడం కోసం గత 20 సంవత్సరాలనుండి గ్రాండ్ హలీమ్ సెంటర్ ను ఏర్పాటు చేశామని అన్నారు.రుచి ,శుచి,శుభ్రతకు మారుపేరని అన్నారు.కేవలం 70/రూపాయలు మాత్రమే అని తెలిపారు.ఇది అరుదుగా దొరికే వంటకం కాబట్టి ఇట్టి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసికోని గ్రాండ్ హోటల్ వారి హలీమ్ రుచులు ఆస్వాదించాలని విజ్ఞప్తి చేసారు.


# ప్రజా సేవకే అంకితం నా జీవితం

- మాజీ కార్పొరేటర్ పోచయ్య, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్
- ఘనంగా కొడే పోచయ్యకు సీనియర్ సిటిజన్స్ సన్మానం



**జయభేరి, మేడిపల్లి :**

20వ డివిజన్లో కమిటీ హాల్ యందు సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ కాడే పోచయ్యకు ఘన సన్మానం చేశారు. గడిచిన 5 సంవత్సరాల్లో డివిజన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసారని అసోసియేషన్ సబ్యులు కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పోచయ్య మాట్లాడుతూ.. మీకు సేవ చేసే అదృష్టం కలిగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్ లో కూడా ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పని చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అందరూ జరిగిన అభివృద్ధి కార్యమాలను గుర్తు చేసుకున్నారు, అదేవిధంగా మాజీ కార్పొరేటర్ సీనియర్ సిటిజన్లు కు చేసిన సేవలను గుర్తు చేస్తూ, అందరు కలిసి మెలిసి ఉండి సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు, అదేవిధంగా అభివృద్ధి కార్యక్రమంలో సహకరించిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జె లక్ష్మారెడ్డి, జనరల్ సెక్రటరీ ఎం లక్ష్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ట్రెజరర్ హరినాథ్, బిక్షపతి, మురళీకృష్ణ జాయింట్ సెక్రెటరీలు, సభ్యులు కృష్ణారెడ్డి, రాంరెడ్డి, మల్లికార్జున రావు, హరినాథ్ రావ్జి,జి ఎల్ చారి సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.



# కరుడుగట్టిన నేరస్థుడు అరెస్టు అతడి అనుచరుడు కుడా...

**జయభేరి, నర్సీపట్నం:**

నర్సీపట్నం పోలీసులు పాత నేరస్తుడు రౌతు మల్లేష్, అతడి అనుచరుడు గెద్దం రామ్ నవీన్ లను అరెస్టు చేసారు. నిందితులనుంచి 22 కేజీలు గంజాయి 138 గ్రాముల బంగారం 20తులాల వెండి 45 వేల రూపాయలు నగదు ఒక స్కూటీ కత్తులు రాడ్డులతో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా విశాఖ జిల్లా గాజువాకకు చెందిన పాత నేరస్థుడు రౌతు మల్లేష్, నర్సీపట్నంకు చెందిన గెద్దం రామ్ నవీన్ ఇద్దరూ ఏజెన్సీ నుంచి గంజాయిని కొనుగోలు చేసుకుని స్కూటీ మీద నర్సీపట్నం వస్తుండగా వాహనాల తనిఖీలో భాగంగా వారిని తనిఖీ చేయగా వారు వద్ద 22 కేజీల గంజాయితో పాటు బంగారం కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రౌతు మల్లేష్ మీద గాజువాక పోలీస్ స్టేషన్లో షీట్ ఒపెన్ చేశారని, ఇతను వివిధ జిల్లాలలో దొంగతనాలు చేస్తూ పట్టుబడి వందలకు పైగా కేసుల్లో ఉన్నాడని 66 కేసులు విచారణలో ఉన్నాయని చాలా కేసుల్లో జైలు జీవితం కూడా గడిపాడని తెలిపారు. ఇతను క్రూరత్వం కలిగిన మనిషిని పోలీసు వారు అరెస్టు చేయడానికి వెళితే వారిపై కూడా దాడి చేస్తాడని తనంతట తాను చచ్చిపోతానని బెదిరిస్తూ ఉంటాడని ఇటీవల నర్సీపట్నం ఎస్సీ కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దోషం చేసినఘటనలోనూ అంబులెన్స్ ఆటోలను కూడా ధ్వంసం చేసిన ఘటనలోనూ రౌతు మల్లేష్ ముద్దాయని ఆ ఘటనలో నర్సీపట్నం పోలీసులు మీద కూడా దాడి చేశాడని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. రౌతు మల్లేష్ తో పాటు అతని అనుచరుడు నవీన్ పై గతంలో దొంగతనాలతో పాటు గంజాయి కేసులు కూడా నమోదయ్యాయని ఆయన తెలిపారు... రౌతు మల్లేష్ ఇద్దరు కుమారులు కూడా నేర ప్రవృత్తి కలవారని వీరు కూడా పలు హత్యయత్నం కేసుల్లో ముద్దాయిలుగా ఉండి ప్రస్తుతం రిమాండ్ లో ఉన్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. రౌతు మల్లేష్, అతని అనుచరుడు నగేష్‌ను అరెస్ట్ చేసిన ఘటనలో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి డిఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందజేశారు.



# ఎంపీ ఈటెల ను కలిసిన కట్ట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు

- ఆలయ ప్రాంగణంలో సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని వినతి

**జయభేరి, మార్చి 04:**

మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్ ను శామీర్ పేట్ కట్ట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శామీర్ పేట్ లోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయ ప్రాగణంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపి ఈటల రాజేందర్ కు కమిటీ సభ్యులు వినతిపత్రం అందచేశారు. ఆలయ ప్రాంగణంలో సొలార్ లైట్లు ఏర్పాటు చేసేలా చూడాలని ఎంపీ ని కోరారు. దీనిపై ఎంపీ ఈటెల రాజేందర్ సానుకూలంగా స్పందిస్తూ కట్ట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ కట్ట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ కిట్ ను సద్వినియోగం చేసుకోవాలి




**జయభేరి, పీ ఏ పల్లి :**

క్రీడల ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరిక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని దేవరకొండ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ అన్నారు. పీ ఏ పల్లి మండలంలోని అజ్మాపురం జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో లయన్ రేపాల మదన్మోహన్ ఆర్థిక సాయంతో అందించిన స్పోర్ట్స్ కిట్లను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు ఉన్నస్థితి ఉన్నత స్థితికి ఎదగడం కోసం అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు లయన్స్ క్లబ్ సంస్థల యొక్క సహకారంతో స్పోర్ట్స్ కిట్టును సద్వినియోగం చేసుకొని విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని తెలిపారు. ప్రతి విద్యార్థిలో క్రీడాశక్తిని గుర్తించి క్రీడల వైపు రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం జగదీశ్వర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ చీదేళ్ళ వెంకటేశ్వర్లు, దాచేపల్లి రాధాకృష్ణ , ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయి డి.ఆర్ లు మంజూరు చేయాలి




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ కార్యవర్గం సమావేశం జరిగినది. ఈ సందర్భంగా సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయి పడిన 4 డి ఆర్ లు మంజూరు చేసి ఆర్థిక ఇబ్బందులనుండి ఆదుకోవాలని కోరినారు. ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్ మాట్లాడుతూ పి. ఆర్. సి త్వరగా అమలు చేయాలని కోరినారు. కార్యనిర్వాహాక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్ ఆధ్వర్యంలో మోటుమర్రి పురుషోత్తం రిటైర్డ్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు 80వ పుట్టినరోజు వేడుక ఘనంగా నిర్వహించినారు. స్వీట్స్ అందజేసినారు.వారు సంతోషాన్ని వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గం సభ్యులు జంపాల యాదగిరి, అసం పాండరయ్య, వనం బుచ్చయ్య,చారి,లక్ష్మయ్య, అప్పం వీరయ్య, ముసిని వీరయ్య, మౌలానా, బలరాములు, సత్యనారాయణ, జీవరత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి

- మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, డిండి :**

ప్రతి ఒక్కరు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం డిండి మండలం దాసరినెమిలిపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 38వ బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి అని ఆయన అన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ గారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్ రావు, PACS ఛైర్మెన్ మాధవరం శ్రీనివాస్ రావు, మాజీ కో అప్షన్ సభ్యులు జంగిర్,మాజీ సర్పంచ్ రామచంద్రం, గంగిడి నరేందర్ రెడ్డి, గంగిడి కొండల్ రెడ్డి, పసునూరి వెంకటయ్య, బొడ్డుపల్లి కృష్ణ, కామోజు నరేష్, గాండూరి లక్ష్మణ్, మసుమ్,తదితరులు పాల్గొన్నారు.



## ఆ ముద్దు జీవితాంతం గుర్తుండిపోతుంది..

అక్కినేని మూడో వారసుడు నాగ చైతన్య ఈ మధ్య కాలంలో తెగ హాట్ టాపిక్ అవుతున్నాడు. పెళ్లిళ్లు, సినిమాలతో చైతూ పేరు మారుమ్రోగిపోతుంది. ముందుగా చైతూ ఏ మాయ చేశావే సినిమా సమయంలో సమంతతో ప్రేమలో పడి ఆ తర్వాత పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లు మంచిగానే ఉన్న ఈ జంట 2021లో విడాకులు తీసుకున్నారు.వారి నిర్ణయం అందరిని ఆశ్చర్యపరచింది. అసలు ఎంతో అన్యోన్యంగా ఉండే ఈ జంట ఈ విడాకులు తీసుకోవడానికి గల కారణం ఏంటనేది ఇప్పటికీ ఎవరికి తెలియదు. ఇక సమంత నుండి విడిపోయిన తర్వాత కొన్నాళ్ల పాటు సింగిల్‌గా ఉన్న నాగ చైతన్య మరో టాలీవుడ్ నటి శోభిత ధూళిపాళ్లతో ప్రేమాయణం నడిపి ఆమెని పెళ్లి చేసుకున్నాడు. వీరి పెళ్లి అన్నపూర్ణ స్టూడియోలో అట్టహాసంగా జరిగింది. ఇక ఈ జంట కూడా అడపాదడపా తళుక్కున మెరుస్తూ అందరిని దృష్టిని ఆకర్షిస్తున్నారు. అయితే నాగ చైతన్యని రానా ఇంటర్వ్యూ చేసిన పాత వీడియో ఒకటి నెట్టింట తెగ హల్‌చల్ చేస్తుంది. ఇందులో రానా.. చైతూని తొలి ముద్దు అనుభవం గురించి అడగగా, తాను తొమ్మిదో తరగతిలోనే మొదటి ముద్ద ఇచ్చిన విషయాన్ని బయటపెట్టారు. అప్పుడు ఇచ్చిన ఆ ముద్దు నా జీవితమంతా పని చేసింది అంటూ నవ్వుతూ నాగ చైతన్య చెప్పుకు రావడం విశేషం. ఇక ఇదే సమయంలో ఓ అభిమాని తనతో ..సమంత కంటే మీరే తెల్లగా ఉన్నారని చెప్పిందట. ఇది తనకు జీవితాంతం గుర్తుండే జ్ఞాపకం అని కూడా చైతూ అన్నారు. అయితే ఈ ఇంటర్వ్యూ జరిగే సమయానికి నాగ చైతన్య, సమంత కలసే ఉన్నారు. .2017లో పెళ్లి చేసుకున్న ఈ జంట, 2021లో విడాకులు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. వీరి విడాకుల ప్రకటన రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ఇక సమంత, చైతూ విడిపోయాక చైతూ రెండో వివాహం చేసుకున్నా, సమంత మాత్రం ఇంకా సింగిల్‌గానే ఉంది.

## పోలీసుల అదుపులో సింగర్ కల్పన భర్త..



నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించిన ప్రముఖ సింగర్ కల్పనకు చికిత్స కొనసాగుతోంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆమె స్పృహలోకి వచ్చారని పేర్కొన్నారు. అయితే, కల్పన ఆత్మహత్యాయత్నం వెనుక ఆమె రెండో భర్త ప్రసాద్ ఉన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సింగర్ కల్పన హైదరాబాద్ నిజాంపేట రోడ్డులోని ప్రీవిలేజ్ విల్లాస్‌లో నివాసం ఉంటున్నారు. రెండు రోజులుగా ఆమె ఇంటి తలుపులు తీయకపోవడంతో పక్క ఫ్లాట్ వారు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కల్పన ఇంటి తలుపులు తీసి లోపలికి వెళ్లగా కల్పన అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే ఆమెను సమీప హోలిస్టిక్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికీ పరిస్థితి విషమంగా ఉండటంతో క్రిటికల్ కేర్ యూనిట్ లో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు



## ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నా

నెట్‌ఫ్లిక్స్ నుంచి వచ్చిన సాక్రేడ్ గేమ్స్ వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి కుబ్రా సైత్ తన వ్యక్తిగత జీవితంలో జరిగిన సంచలన విషయం గురించి మీడియాతో తాజాగా పంచుకుంది. తాను అండమాన్ ట్రిప్‌లో ఉన్నప్పుడు ఒక స్నేహితుడితో కలవడం వలన గర్భం దాల్చానని.. దీంతో ఒక్కసారిగా ఏం చేయాలో తోచలేదని అందుకే వెంటనే ఎవరికీ చెప్పకుండా.. ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నాను అంటూ నటి చెప్పుకొచ్చింది. అబార్షన్ చేయించుకోవడానికి వెళ్లినప్పుడు నేను చాలా బలహీనంగా ఉన్నాను. అప్పుడే అర్థం అయ్యింది. దీనిని నేను మోయలేను అని.. ఒకవేళ నేను అబార్షన్ చేయంచుకోపోతే బిడ్డతో జీవిస్తానని చెప్పే ధైర్యం కూడా నాకు లేదనిపించింది. అందుకే ఎవరికీ చెప్పకుండా ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నా. అబార్షన్ అనంతరం నేను చాలా రిలీఫ్ అయ్యాను. ఏదో బరువు దిగినట్లు అనిపించింది. అయితే అబార్షన్ తర్వాత ఈ విషయాన్ని చాలా ఏండ్ల వరకు ఎవరితో పంచుకోలేదని తెలిపింది. ఇక ఈ విషయాలన్నింటిన తన బయోగ్రఫీ అయిన ఓపెన్ బుక్: నాట్ క్వైట్ ఎ మెమోయిర్" (2022) అనే పుస్తకంలో ప్రస్తవించింది కుబ్రా సైత్ సినిమా విషయాలకు వస్తే.. సాక్రేడ్ గేమ్స్ తర్వాత మళ్లీ కనిపించలేదు ఈ నటి. అయితే తాజాగా బాలీవుడ్ నుంచి వస్తున్న రామాయణ్‌లో ఈ భామ రావణుడి చెల్లి శూర్పణఖ పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా దీనిపై చిత్రబృందం ప్రకటించాల్సి ఉంది.

## సిరాజ్‌తో డేటింగ్

ఇండియన్ స్టార్ క్రికెటర్‌లు, బాలీవుడ్ హీరోయిన్‌ల మధ్య డేటింగ్ వార్తలు రావడం సహజమే అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు క్రీడ ప్రముఖులు సినీ నటుల మధ్య వార్తలు రాగా.. అందులో కొన్ని నిజం కూడా అయ్యాయి. అయితే తాజాగా స్టార్ క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్ తో బిగ్ బాస్ 13 ఫేమ్ నటి మహిరా శర్మ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వైరల్ అయ్యాయి. దీనికి ముఖ్య కారణం సిరాజ్, మహిరాలు ఇన్‌స్టాగ్రామ్ ఒకరినొకరు ఫాలో అవ్వడమే. అయితే ఈ ఫాలోయింగ్ లైక్‌ల వరకు వెళ్లడంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారా అని గాసిప్స్ స్టార్ట్ అయ్యాయి. అయితే ఈ పుకార్లపై తాజాగా స్పందించింది మహిరా శర్మ. బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నేను ఎవరినీ డేట్ చేయడం లేదు. సిరాజ్‌తో డేటింగ్ అంటూ వస్తున్న వార్తలు నిజం కాదు. పబ్లిక్ ఫిగర్‌గా ఇలాంటి పుకార్లను ఎదుర్కోవడం సర్వసాధారణం. అభిమానులు తమకు నచ్చిన విధంగా ఎవరితోనైనా లింక్‌లు పెడుతారు. ఇంతకుముందు బిగ్ బాస్‌లో ఉన్నప్పుడు కూడా ఇలాంటివి జరిగాయంటూ మహిరా చెప్పుకొచ్చింది.





## సూపర్ నాచురల్ కాన్సెప్ట్

రోషన్, కార్తికేయదేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్‌కృష్ణ దర్శకుడు. ఈ నెల 21న విడుదలకానుంది. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. సూపర్ నాచురల్ ఎలిమెంట్స్‌తో సాగే వినోదాత్మక చిత్రమని, ముగ్గురు యువకుల జీవిత ప్రయాణం నేపథ్యంలో సాగుతుందని, థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఫాంటసీ అంశాలతో రూపొందిన ఈ ప్రేమకథా చిత్రంలో ఎన్నో సర్‌ప్రైజ్‌లుంటాయని నిర్మాతలు పేర్కొన్నారు. విభిన్న కథా చిత్రంలో నటించడం ఆనందంగా ఉందని చిత్ర తారాగణం తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సంతు ఓంకార్, నిర్మాతలు: రాహుల్ రెడ్డి, శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ కృష్ణ, దర్శకుడు: సుప్రీత్‌కృష్ణ.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com